
# అయోధ్యలో అన్నదాన భాగ్యం

రాములోరి చెంత అన్నదానం

## సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితికి అవకాశం

- 45 రోజుల పాటు అన్న వితరణ
- క్షేత్రపురిలో 3వ లంగర్ కేటాయింపు
- ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 28 వరకు అన్నదానం

సిద్దిపేట, జనవరి 4 : అయోధ్య రాములోరి సన్నిధిలో అన్నదానం చేసే అరుదైన అవకాశం దక్షిణ భారతదేశంలోనే తొలిసారి సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి దక్కింది. సుమారు 45 రోజులపాటు ఇక్కడ రోజుకు 5వేల నుంచి 7వేల మందికి అన్నదానం చేసే భాగ్యాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని ఆర్యోక్తి... అన్నిదానాల్లో కెల్ల అన్నదానం విశిష్టమైంది. 2011 నుంచి అన్నదానం చేస్తూ అనేక మంది యాత్రికుల ఆకలిని తీరుస్తున్న సిద్దిపేటకు చెందిన ప్రముఖ సేవా సంస్థ అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి అయోధ్య రామమందిరంలో రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 22న జరుగనున్న నేపథ్యంలో అక్కడ అన్నప్రసాద వితరణ చేసే అవకాశాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ద్వారా లభించింది. జమ్మూకశ్మీర్‌లోని ప్రసిద్ధ మంచు లింగం అమర్‌నాథ్ యాత్రికులకు అన్నదానం చేసే లక్ష్యంతో సిద్దిపేటలో 2011లో ప్రారంభమైన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అప్పటి నుంచి చార్‌ధామ్ యాత్రికులకు బాల్తల్, పంచ తరుణిల వద్ద లంగర్లు వేసి అన్నదానం చేస్తున్నది. దీంతోపాటు పర్యావరణ పరిరక్షణకు వినాయకచవితి రోజు ఏటా మట్టి వినాయకులను ప్రజలకు అందజేస్తున్నది. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి అయోధ్య రామ మందిర ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 28 వరకు అక్కడికి వచ్చే సాధువులు, స్వామీజీలు, పీఠాధిపతులు, యాత్రికులకు దాదాపు 45రోజులపాటు అన్నదాన వితరణ చేయనున్నది. అయోధ్యలోని రామమందిరానికి సమీపంలోని క్షేత్రపురిలో ఏర్పాటు చేసిన 3వ నెంబర్ లంగర్‌లో అన్నదాన కార్యక్రమం చేపడుతారు. లంగర్‌లోనే కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ఆటోల సహాయంతో అయోధ్య పురవీధుల్లోనూ భక్తులకు అన్నదానం చేసేందుకు సిద్ధమవుతున్నారు. సుమారు రూ.98లక్షల నుంచి రూ.కోటి ఖర్చయ్యే ఈ కార్యక్రమాన్ని సేవా సమితి సభ్యులు, దాతల సహకారంతో అమలు చేయనున్నారు. ఈ అన్న వితరణ కార్యక్రమంలో 120మంది సభ్యులు తమ సేవలు అందించనున్నారు. రోజూ ఉదయం ఇడ్లి, ఉప్మా, మధ్యాహ్నం చపాతి, భోజనంతోపాటు సాయంత్రం భక్తులకు అల్పాహారం, తేనీరు అందించనున్నారు.



అయోధ్యలో రామమందిర నిర్మాణ స్థలంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు

### ఎన్నో జన్మల పుణ్యఫలం...

12 సంవత్సరాలుగా ఏటా అమరనాథ్‌లో పరమేశ్వరుడి చెంత భక్తులకు అన్నదానం చేస్తున్నాం. భగవాన్ శ్రీరామచంద్రుడి కృప కటాక్షాలతో అయోధ్యలో 45 రోజుల పాటు అన్నదాన వితరణ చేసే భాగ్యం కలిగింది. ఇది ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాం. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు మా కార్యక్రమాలు ఏటా కొనసాగిస్తాం. సామాజిక సేవలో ఉన్న తృప్తి మరేదాంట్లో దొరకదు.

–ఉప్పల భూపతి, నైతి కైలాసం, అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు, సిద్దిపేట




అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి బ్రోచర్



పుస్తకావిష్కరణ చేస్తున్న జయప్రకాశ్ నారాయణ, సినీ నిర్మాత నర్సింగరావు

## అధికారాన్ని నిర్ణయించేది ప్రజలే

- ఉమ్మడి జీవనం కోసం పాటుపడాలి
- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ

గజ్వేల్, జనవరి 4 : దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని నిర్ణయించేది ప్రజలేనని, ఎవరూ అధికారంలో ఉండాలో ప్రజలు తమ నిర్ణయాధికారాన్ని ఓటు రూపంలో వ్యక్త పరుస్తారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. గురువారం గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లోని ఎస్‌ఎల్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో మోహనరాగం సహస్రం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీల ఎన్నికల ఖర్చు రూ.8వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఖర్చు చేశారన్నారు. ఓటు వేసే ప్రతిఒక్కరూ సమాజం గురించి మరింతగా నెర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు అంచెలంచెలుగా అందినంతగా ప్రజాస్వామ్యంలో ఎదగాలన్నారు. ప్రజాస్వామ్య సంస్కృతి కోసం అందరూ కలిసికట్టుగా నడవాలని, ఉమ్మడి జీవనం కోసం పాటుపడాలన్నారు. సంస్కృతిని గొప్పగా కాపాడుకొవాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ సంస్కృతి, సాహిత్యాన్ని ఉన్న తరం జీర్ణించుకునేలా మానవ విలువలను తెలియజేయాలన్నారు. శ్రీశ్రీగారు చెప్పిన విషయాలను ఆనాడు ప్రతిఒక్కరూ విశ్వసించారన్నారు. ప్రతిభను వెలికి తీసే విధంగా సమాజంలో అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి కల్పించే జన్య సంపదను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత నర్సింగరావు, లోక్‌సత్తా ఉభయ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తు స్వీకరించాలి



చేగుంట మండలం పొలంపల్లి ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి
- ప్రజల్లో ఉన్న సందేహాలను తీర్చాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- చేగుంట మండలం పోలంపల్లి, తూప్రాన్ మున్సిపల్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల పరిశీలన

చేగుంట/ తూప్రాన్, జనవరి 4: ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. చేగుంట మండలం పోలంపల్లి, తూప్రాన్ మున్సిపాలిటీలోని 11వ వార్డు (పడాలపల్లి)లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం సందర్శించి, దరఖాస్తుల తీరుతెన్నులు, రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. ప్రజలు అందజేస్తున్న ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను తప్పులు లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని ఆదేశించారు. పథకాల అమలును ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. చేగుంట, నార్సింగి మండలాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. పొలంపల్లిలో జరిగిన కార్యక్రమంలో చేగుంట మండల ప్రత్యేకాధికారి జమ్లానాయక్, తహసీల్దార్ గియాఉన్నీసాబేగం, ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్, ఏవో హరిప్రసాద్, ఏఈవోలు మాధవి, శోభ, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఏఈ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ యెన్నెల్లి నిర్మలాసత్యం పాల్గొన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్, కౌన్సిలర్ అరుణావెంకట్‌గౌడ్, జడ్పీ సీఈవో వెంకటశైలేశ్, తహసీల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ పాల్గొన్నారు.

## నల్లవాగు నీటి విడుదల



- 940 ఎకరాల ఆరుతడి పంటలకు సాగునీరు
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

సిర్గాపూర్, జనవరి 4: సంగారెడ్డి జిల్లాలోని మధ్యతరహా నల్లవాగు ప్రాజెక్టు ద్వారా యాసంగి పంట సాగుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి గురువారం సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతుల సంప్రదాయ పద్ధతి ప్రకారంగా మొదటగా ఎమ్మెల్యే, ప్రాజెక్టులోని జలాలకు (గంగమ్మ తల్లికి) ప్రత్యేక పూజలు చేసి తెప్పను వదిలారు. అనంతరం స్థానిక ప్రధాన కాల్వల ద్వారా నీటిని వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా పంటలకు మాత్రమే వదులుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ డీఈఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు కాల్వల మరమ్మతుల కారణంగా ఈ యాసంగిలో 940ఎకరాల పంటల సాగుకు నీటి పారుదల చేస్తున్నామని తెలిపారు. ఇందులో గోసాయిపల్లి, ఎమర్జెన్సీ కాల్వ కింద 60 ఎకరాల వరి పంట, మిగతా ఆరుతడి పంటలు సాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ పవన్‌కుమార్, ఏఈఈ సూర్యకాంత్, రవి సిబ్బంది, రైతులు గ్రామస్తులు ఉన్నారు.

సిర్గాపూర్: నల్లవాగు ప్రాజెక్టులో గంగమ్మకు పూజలు చేసి తెప్ప వదులుతున్న ఎమ్మెల్యే, రైతులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

## కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

సంగారెడ్డి, జనవరి 4: సంగారెడ్డి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతికి జిల్లా అధికారులు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపగా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీ, ప్రధాన కార్యదర్శి రవి, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను సన్మానించిన వారిలో తహసీల్దార్లు మహిపాల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, దశరత్, టీఎన్జీవోస్ నాయకులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నిర్మల, రాజకుమారి, నేతి శ్రీనివాస్, భాస్కర్, విజయ్‌కుమార్, సుధామణి, ఎండీ షకీల్, కృష్ణ, సుభాశ్, శ్రీకాంత్ గౌడ్, రవికృష్ణ, హరిప్రసాద్, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ నాయకులు అఖిల్, గణేశ్, అరుణ్ ఉన్నారు.



కలెక్టర్ వల్లూరు క్రాంతికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవోస్ నాయకులు

# ద్విముఖ వ్యూహంతో సంగారెడ్డి జిల్లా అభివృద్ధి

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు పెద్దపీట

- విద్య, వైద్య, మహిళా సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి
- పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం
- సంగారెడ్డి నూతన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ,
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్



కలెక్టర్ క్రాంతికి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి, జనవరి 4 (నమస్తే తెలంగాణ)/సంగారెడ్డి :సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్తామని నూతన కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో మెంచు నగేశ్ స్వాగతం పలికారు. అనంతరం తన చాంబర్‌లో వల్లూరు క్రాంతి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఓ వైపు పట్టణ ప్రాంతాలు, మరోవైపు గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమాంతరంగా అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. కమిషనర్‌గా పనిచేసిన అనుభవంతో జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా కృషిచేస్తానని తెలిపారు. అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజాపాలన ద్వారా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. విద్య, వైద్యం, మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి పెడతానని తెలిపారు.

#### ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటానని నూతన కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతిని అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో మెంచు నగేశ్, డీఆర్డీవో శ్రీనివాస్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి సన్మానించారు.

#### అధికారులతో సమావేశం, టెలీకాన్ఫరెన్స్

సంగారెడ్డి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వల్లూరు క్రాంతి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. శాఖల పనితీరుకు సంబంధించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రజాపాలనపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన వచ్చిన అభయహస్తం దరఖాస్తులను 16వ తేదీ వరకు డాటాఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం ప్రజాపాలనపై కలెక్టర్ క్రాంతి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

## వెరీగుడ్డు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- ఎట్టకేలకు విద్యార్థినులకు అందిన కోడిగుడ్లు
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ వినతి



విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనంతోపాటు గుడ్లు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 4: మద్దూరులోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో నెలరోజులగా విద్యార్థినులకు కోడిగుడ్లు అందకపోవడంతో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'గుడ్డు గుటకాయ స్వాహా' అనే శీర్షికతో బుధవారం కథనాన్ని ప్రచురించడంతో గురువారం కాంట్రాక్టర్ హాస్టల్‌కు గుడ్లు పంపించారు.రెండువారాలకు సరిపోయేలా సుమారు 300 కోడిగుడ్లు పంపించగా, విద్యార్థులకు భోజనంతోపాటు ఉడకబెట్టిన గుడ్లను అందజేశారు. నెలరోజులుగా గుడ్లు పంపించలేదని, తమకు గుడ్లు అందేలా కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.

### కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మద్దూరు బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు గుడ్లు, చికెన్, మటన్ అందించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ గురువారం సిద్దిపేట కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ నెలరోజులుగా హాస్టల్‌లో మెనూ పాటించకుండా 49మంది విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, నాయకులు నవీన్, పవన్ పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



గుమ్మడిదల జాతీయ రహదారిపై బస్సుల కొరతతో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

## మహాలక్ష్మితో తంటాలు

- బస్సులు లేక ఇబ్బందులు
- ఫుట్‌బోర్డు ప్రయాణం
- బస్సుల కొరతతో రోడ్డుపై విద్యార్థులు
- ఇంటికి తిరుగుముఖం
- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి
- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

గుమ్మడిదల, జనవరి 4 : సరిపడా బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తేనే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే దుస్థితి వచ్చిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళల రద్దీ పెరిగింది. దీంతో ఉదయం కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల కొరత ఏర్పడంతో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. ఈ పథకంతో ఆటోడ్రైవర్లు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే ప్రతి ఆర్టీసీ బస్సు మహిళలతో కిక్కిరిసిపోతుంది. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. సమయానికి బస్సులు రాక రోడ్లపై గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారుల ఇబ్బందులను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.